నవతెలంగాణ
మహబూబ్‌నగర్
1
ఆదివారం 23 జూలై 2023



అలుగు పారుతున్న సాలార్ నగర్ ప్రాజెక్టు

నవతెలంగాణ-గండీడ్

నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని సాలార్ నగర్ ప్రాజెక్ట్ శుక్రవారం సాయంత్రం అలుగు పారుతుండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాల ప్రారంభంలో వర్షాలు లేక ఈసారి పంటలు వేయడం కష్టమవుతుందన్నారు. నాలుగు రోజుల ముసురువానతో చెరువు జలకళలాడుతుంటే రైతుల ఆనందానికి అవధులు లేవని,రెండు పంటలకు పుష్కలంగా నీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అలుగుపారడంతో వివిధ గ్రామాల నుంచి జనాలు అలుగులో చేపలు పట్టడంలో నిమగ్నమయ్యారు.

చట్టాల అవగాహన సదస్సు

నవతెలంగాణ- రాజాపూర్



రాజాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం సురక్ష పోలీస్ కళ బృందం మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో బాలబాలికలకు చట్టల గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్ర మంలో రాజాపూర్ స్థానిక వెంకట్ రెడ్డి ,స్థానిక పోలీస్ బృందం ఉపసర్పంచ్ అల్లె శ్రీనివాస్, మహబూబ్‌నగర్ పోలీస్ శాఖ వారు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త బతుకులపై చిత్తశుద్ధి కరువు

- అవార్డులు తెచ్చిన కార్మికులపై వివక్ష
- కరోనా సమయంలో ప్రాణాలు తెగించి సేవలు
- 21 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోని పాలకులు
- మా మొర ఆలకించండి సారూ : జీపీ కార్మికులు



ప్రపంచ మహమ్మారి కరోనా పేరు చెబితేనే వణికిపోయే రోజులు. వైరస్ సోకి చనిపోయిన వారిని కుటుంబ సభ్యులు ముట్టుకోలేదు. ఆ సమయంలో. ప్రాణాలను లెక్కచేయకుండా శవాలను ఖననం చేశాం. గ్రామాలల్లో పేరుకుపోయిన చెత్త మురికిని తొలగించి రాష్ట్రానికి జాతీయ అవార్డులు తెచ్చిపెట్టాం.ఇన్ని సేవలు చేసిన మేము చెత్త బతుకులుగా జీవనం సాగిస్తున్నాం. కనీసం మమ్ములను మనుషులుగా కూడా చూడని ఈ సమాజంలో ప్రభుత్వం మెరుగైన వేతనాలైనా ఇవ్వడం లేదు. రోడ్లు వీధులను శుభ్రం చేసే మా బతుకులు రోడ్డుపాలైనా పట్టించుకోవడంలేదని గ్రామపంచాయతీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులు 15 రోజులుగా సమ్మె చేస్తున్న సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం.

నవ తెలంగాణ-
మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ వివక్ష

గ్రామ పారిశుధ్యం చేసూ్త ప్రజల ప్రాణాలను కాపాడుతున్న పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అరకోర వేతనాలు చెల్లిస్తోంది. కంపు కొడుతున్న పల్లెలను పరిశుభ్రం చేసి రాష్ట్రానికి జాతీయ అవార్డులు తెచ్చి పెట్టింది పంచాయతీ కార్మికులే. ఇన్ని సేవలు చేసిన పంచాయతీ కార్మికులను కనీసం మనుషులుగా కూడా చూడడం లేదు.15 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ కార్మికుల కోసం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.మలేరియా, డెంగ్యూ, జ్వరం వచ్చి మంచం పడుతున్నారు. వర్షాకాలంలో వ్యాధులు పెరిగితే నియంత్రణ చేయడం కష్టంగా ఉంది.

పాలకులు స్పందించకపోవడం విడ్డూరం

స్వీపర్లు కారో బర్లు పంపు ఆపరేటర్లు ట్రాక్టర్ డ్రైవర్లు ఎలక్ట్రీషియన్లు ఉమ్మడి జిల్లాలో 1642 గ్రామాల పరిధిలో 5930 మంది ఉన్నారు.నాగర్ కర్నూల్ లో 2080 మంది మహబూబ్‌నగర్ 1300, వనపర్తి 850, గద్వాల 750, నారాయణపేటలో 950 మంది ఉన్నారు.వీరంతా అధికారికంగా నెలకు రూ. 9500 లు ఇస్తున్నామని లెక్కలు చెబుతున్నా కార్మికులకు మాత్రం ఐదు వేలకు మించి ఇవ్వడం లేదు. ఒక్కో గ్రామంలో ఐదు మంది పని చేయాల్సి ఉండగా ఇద్దరినీ చేయిస్తూ ఐదు మంది పనిచేసినట్లుగా వేతనాలు ఇస్తూ లెక్కలు రాస్తున్నారు. కొన్ని గ్రామాలల్లో అయితే ఐదు మంది కార్మికుల వేతనాలను ఎనిమిది మందికి పంచి విధులు నిర్వహించమని చెబుతున్నారు.

వెట్టి చాకిరి

గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల చేత అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి వెట్టి చాకిరి చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఇండ్లలో పనులు చేయమని చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం 3 గంటలకు వచ్చి రాత్రి 8 దాకా వివిధ రకాల పనులు చేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారు. మల్టీపర్పస్ విధానం వచ్చిన తర్వాత చెత్త పనులు చేసే వారు సైతం ఎలక్ట్రిషన్ పనులు చేయాల్సి వస్తుంది. దీంతో నైపుణ్యం లేని కార్మికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు కార్మిక సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హక్కులు అడిగితే నిందలు

గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు హక్కులు అడిగితే వారిపై నిందలు మోపుతున్నారు. పనిచేసిన వారిపై సైతం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఎవరైనా సర్పంచ్ మాట వినకపోతే విధుల నుంచి తొలగిస్తున్నారు. అధికార పార్టీలో ఉంటేనే ఉద్యోగం ఉంటుందంటూ హెచ్చరిస్తున్నారు. కనీస వేతన చట్ట ప్రకారం 26 వేలు నెల జీతం ఇవ్వాల్సి ఉండగా గ్రామపంచాయతీ కార్మికులకు కేవలం 5000 లోపు చెల్లించడం దారుణం. సంవత్సరాల తరబడి సేవలు చేస్తున్న వీరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించకపోవడం దారుణం. ఏండ్ల తరబడి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదు. వేతన ఒప్పందం పీఆర్సీ ప్రకారం ఇవ్వాల్సిన రూ. 19 వేలు ఇవ్వడం లేదు. కారోబార్లు బిల్ కలెక్టర్లకు నిబంధన ప్రకారం ప్రమోషన్ ఇవ్వాల్సి ఉంది. జీవో నెంబర్ 51ని రద్దు చేసి గ్రామపంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని వీరు కోరుతున్నారు. విధుల్లో ఉన్న పంచాయతీ కార్మికులు చనిపోతే 10 లక్షల ఆర్థిక సహాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆందోళన చేస్తున్నారు.

మావి చెత్త బతుకులు

పొద్దస్తమానం గ్రామానికి సేవ చేయాలి. సర్పంచుకు మండల అధికారికి ఎవరికి కోపం వచ్చినా మా ఉద్యోగం వూడుతుంది. ఏండ్ల తరబడి పనిచేసినా క్రమబద్ధీకరణ చేయడం లేదు. నెలకు రూ. 9 వేల వేతనం ఇస్తామని 5 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు మా గోసను చూసి వేతనాలు పెంచాలి.

లక్ష్మయ్య ,
పారిశుద్ధ కార్మికుడు, తెలకపల్లి

పంచాయతీ కార్మికుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



గ్రామపంచాయతీ కార్మికులు 15 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఎన్ని ఉద్యమాలు చేసిన పాలకులు పట్టనట్లుగా వ్యవహారిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ పనులు చేస్తూ రోగాల బారిన పడినా పాలకవర్గాలు పట్టించుకోవడం లేదు. వేతన ఒప్పందం ప్రకారం జీతాలు పెంచడంలో వివక్ష చెబుతున్నారు. ముఖ్యంగా చదువు నైపుణ్యత కలిగిన వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదు. జీవో 51 రద్దుచేసి గ్రామపంచాయతీ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలి.

ఆర్ శ్రీనివాసులు
సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగర్ కర్నూల్

మణిపూర్ మారణహోమాన్ని ఆపండి

- ఐద్వా జిల్లా కార్యదర్శి బి పద్మ, టి.పి.ఎస్ .కె జిల్లా కన్వీనర్ వీ కురుమూర్తి



మహబూబ్ నగర్ : గత కొన్ని రోజులుగా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ హోమాన్ని మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బీ పద్మ, టి.పి.ఎస్ .కె జిల్లా కన్వీనర్ వీ కురుమూర్తి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ చౌరస్తాలో మణిపూర్ లో ఇద్దరు గిరిజన మహిళలను అత్యాచారం చేసి ఊరేగింపు జరిగిన ఘటనపై నిరసన చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వి.పద్మ ,టీపీఎస్ కె జిల్లా కన్వీనర్ వి. కురుమూర్తి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ హెూమాన్ని అరికట్టాలన్నారు.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అత్రాస్ ఘటనలో మనీషా అనే దళిత మహిళను అత్యాచారం చేసే హత్య చేశారన్నారు. గుజరాత్‌లో బిల్కీస్ బాను అనే మహిళను అత్యాచారం హత్య చేయడం కాశ్మీర్లో అసిఫా అత్యాచారం చేసి హత్య చేయడం లాంటి ఘటనలు చూస్తే ఈ ప్రభుత్వము దళితులు గిరిజనులు క్రిస్టియన్ ముస్లిం మైనార్టీల పైన పనిగట్టుకుని ఇటువంటి ఘటనలకు పూనుకుంటుందన్న విషయం అర్థమవుతుందన్నారు. మణిపూర్ ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు గౌసియా బేగం,అనిఫా బేగం సుశీల,సుమిత్ర అంజమ్మ ,జ్యోతి మమత,ఉపాధ్యా ఉపాధ్యాయ సంఘం నాయకులు సుదర్శన్ , ఖాదరయ్య అజయ్ బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పోరు గడ్డ లో పోరాటాలను పట్టించుకోని ప్రభుత్వం

- టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్

మహబూబ్ నగర్ : పోరాటం చేసే వాళ్ళ సమస్యలు పరిష్కరించక పోవడమేనా? ప్రభుత్వ నిర్లక్ష్యమని టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రాలు స్థానిక టీటీడీ కల్యాణ మండపం ధర్నా చౌక్ దగ్గర 27వ రోజు స్కూల్ స్వీపర్ ల నిరాహార దీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పని చేసే పారిశుద్ధ కార్మికులు గత 27 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్ల కొరకు శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వము పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గట్టన్న, రాష్ట్ర నాయకులు చంద్రాయుడు, బాలా గౌడ్, జమీర్ పాషా, జయమ్మ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా..

రాజాపూర్ : రాజా పూర్ మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలో భారత్ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి పైన శనివారం రోజు ఉదయం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళుతున్న కారుకి కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి నాలుగు పల్టీలు కొట్టింది. కారులో ఉన్న సిబ్బందికి ఎలాంటి ప్రాణా హాని కాలేదు. స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజాపూర్ పోలీసులు తక్షణమే చేరుకొని క్రేన్ సహాయంతో కారును తొలగించామని పోలీస్ నరేందర్ గౌడ్ తెలిపారు.

పెంచిన వికలాంగుల పెన్షన్ జీవో విడుదల చేయాలి

మహబూబ్ నగర్ : రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు పెంచిన 1000 రూపాయల పెన్షన్ వెంటనే అమలు చేస్తూ జీవో జారీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షులు మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 9న మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు వికలాంగుల పెన్షన్ మరో 1000 రూపాయలు పెంచుతున్నమని, పెంచిన పెన్షన్ తో కలిపి జూలై నెల నుండి 4016 అమలు చేస్తామని ప్రకటించిన విషయం వారు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ప్రకటనతో వికలాంగులు చాలా సంతోష పడి, ముఖ్యమంత్రికి పాలాభిషేకలు చేశామని తెలిపారు. కానీ హామీ ఇచ్చి 45 రోజులు గడుస్తున్న అమలుకు మాత్రం నోచుకోవడం లేదన్నారు. జూలై నెలలో ఇచ్చే పెన్షన్లు పెరిగిన పెన్షన్ వర్తింప చేస్తామని ప్రకటించి, ఇప్పటి వరకు ఎందుకు జీవో విడుదల చేయలేదు అని వారు ప్రశ్నించారు.

నేరస్తులకు శిక్ష పడేటట్లు చేయడంలో కోర్టు ఆఫీసర్లదే ముఖ్య పాత్ర

మహబూబ్‌నగర్ : కోర్టులో నేరస్తులకు శిక్ష పడేటట్లు చేయడంలో కోర్టు డ్యూటీ నిర్వహించే ఆఫీసర్లది ముఖ్యపాత్ర అని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. శనివారం సీడీపీఓ, కోర్ట్ లైసన్ ఆఫీసర్సతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, నేర రహిత సమా జముగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు పోలీసు సిబ్బంది శ్రమించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట రమణ రెడ్డి, ఇన్స్పెక్టర్ బషీర్, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్స్, కోర్టు కానిస్టేబుళ్ళ, సిబ్బంది పాల్గొన్నారు.

మలక చెరువు కట్టకు మరమ్మతులు

మహమ్మదాబాద్ : గత నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షానికి మండల పరిధిలోని మల్కచెరువు తూము ప్రక్కన పెద్ద రంధ్రం పడడంతో గుర్తించిన అధికారులు శనివారం జేసీబీ సహాయంతో రంధ్రంను పూడ్చి వేశారు. చెరువు కట్టకు మరమ్మతు పనులు చేపట్టి ఎలాంటి ప్రమాదం జరగ కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం మల్కా చెరువుకు తూము ప్రక్కన గండి పడినట్లు రైతులు ,స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన అధికారులు మరమ్మత్తు చర్యలు పట్టారు. ఏ మాత్రం ఆలస్యం చేసిన మల్కా చెరువుకు గండిపడి చెరువులో నీరు వృధా అవుతుందేమో అని రైతులు పేర్కొంటు న్నారు. సమస్యపై వెంటనే స్పందించిన తహసీల్దార్ ఆంజ నేయులు, సాగునీటి శాఖ అధికారులకు గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

'మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి '



మహబూబ్ నగర్ : గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించమని సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు వి కురుమూర్తి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో మల్లికార్జున చౌరస్తా,అంబేద్కర్ చౌరస్తాకు కార్మికులందరూ రోడ్లపైకి వచ్చి ఒంటి కాలితో నిరసన తెలిపి, తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 17 రోజులుగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా లో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్న కూడా వారి డిమాండ్లను తీర్చడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది వారు ఆరోపించారు. ఈ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులతో గ్రామాలలో అన్ని రకాల పనులు చేస్తూ, ఎన్నో సందర్భాలలో ప్రభుత్వాలకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం 19500 అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతి ప్రకారం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేది లేదని జేఏసీ నేతలు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ నాయకులు జి రాజ్ కుమార్,గ్రామ పంచా యతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పాండు,రామచంద్రయ్య రాగిణి,లక్ష్మమ్మ, యాదమ్మ, శ్రీనివాసులు, ఖాదరు, బాలరాజు, రాఘవేందర్, వెంకట్ రాములు, తదితరులలి పాల్గొన్నారు.

హన్వాడ : మండలంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు కేవీపీఎస్ ,ఎస్ఎఫ్ఐ రైతు సంఘం సంపూర్ణ మద్దతు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ ,ఏపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య మాట్లాడుతూ జీపీ కార్మికుల పట్ల ప్రభుత్వం తీరు సరికాదన్నారు. కనీస గౌరవ వేతనాలు ప్రమాద బీమా ఆరోగ్య బీమా తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.శానిటైజేషన్ కోసం బ్లౌజులు వర్షాకాలంలో రైన్ కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు గంగపురి రంగన్న, చిన్నప్ప, వెంకట రాములు, బాలు, తిమ్మప్ప ఉన్నారు.

గండీడ్ : మండల కేంద్రంలో శనివారం పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా వినూత్న రీతిలో నిరసన చేశారు.షాపులు,తహసీల్దార్ కార్యాలయంలో బిక్షాటన చేశారు.సల్కర్ పెట్ సర్పంచ్ జితేందర్ రెడ్డి,తహసిల్దార్ జ్యోతి కార్మికులకు నగదు అందజేశారు.

మిడ్జిల్ : గ్రామపంచాయతీ వర్కర్ల డిమాండ్ న్యాయమైనదని ప్రభుత్వం గ్రామపంచాయతీ వర్కర్లను చిన్నచూపు చూస్తాని మండల అధ్యక్షులు జంగయ్య అన్నారు.సమ్మెలో భాగంగా మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహం దగ్గర శనివారం సమ్మె కొనసాగుతుంది. కార్యక్రమంలో జీపీ వర్కర్లు బాలస్వామి, ఉషయ్య, వెంకటయ్య, భాగ్యమ్మ ,మణెమ్మ, పాల్గొన్నారు.

'హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి '

హన్వాడ : మండలంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ,కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థు లు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్,రైతు సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడారు పాఠశాలలు ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేయలేదన్నారు. విద్యార్థులకు హాస్టల్లో బాత్రూంలో మరుగుదొడ్లు లేక అర కిలోమీటర్ దూరం వెళ్లి కాలకృత్యాలు తెలుసుకుంటున్నారని అన్నారు వర్షాకాలం కాబట్టి విష సర్పాలు సంచరిస్తాయని అన్నారు..అధికారులు స్పందించి వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సతీష్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ వినతి పత్రాన్ని పై అధికారులకు పంపిస్తానని తహసీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య శ్రీశైలం, శివ నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మద్యం మత్తులో ప్రమాదాలను తెచ్చుకోవద్దు

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- ఎర్రి స్వామి డీటీఓ నాగర్ కర్నూల్

యువత మద్యం మత్తులో వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు అతివేగంతో ఆగి ఉన్న లారీని బస్సుల ను ఢీకొంటున్నారు. దీంతో ఇటీవల అనేకమంది ప్రమాదాలలో చనిపోయిన ఘటనలు ఉన్నాయి. నిబంధనలు పాటించి తమ అమూల్యమైన జీవితాలను నాశనం కాకుండా చూసుకోవాలని నాగర్ కర్నూల్ డీటీఓ ఎర్రి స్వామి అన్నారు. ఆయన నవ తెలంగాణతో అనేక అంశాల విషయంలో మాట్లాడారు.

నవ తెలంగాణ -
మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి



నవతెలంగాణ : వాహనాలను నడిపే వారికి మీరు ఇచ్చే సలహాలు ఏమిటి ?

డీటీఓ : ప్రధానంగా వాహన దారులు తమ వాహనాలను కండిషన్ లో ఉన్నాయో లేవో చూసుకోవాలి. కండిషన్ లేని వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. పరిమితమైన వేగంతో నడుపుతూ రోడ్డు నియమ నిబంధనలను పాటించాలి. ముఖ్యంగా మద్యాన్ని తాగి వాహనాన్ని నడపరాదు. మద్యం మత్తులో వాహనాలు నడిపి తమ కుటుంబాలను రోడ్డున పడేయద్దు. 18 ఏళ్ల లోపు బాల బాలికలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావద్దు. ఈమధ్య యువత మద్యం మత్తులో ఆగి ఉన్న బస్సును లారీని ఢీకొడుతున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక సైతం ప్రమాదానికి కారణమౌవుతుంది.

నవతెలంగాణ :ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు ఏమి తీసుకుంటున్నారు ?

డీటీఓ : ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. అతివేగంగా వెళ్లినా పరిమితికి మించి బరువును తీసుకెళ్లినా ఐదు లక్షల వరకు జరిమానా విధిస్తున్నాం.

నవతెలంగాణ : పాఠశాల బస్సులకు ఫిట్నెస్ లేదనే ఆరోపణలు ఉన్నాయి ? మీరేమంటారు .

డీటీఓ :ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల్లో ఉండే బస్సులను తనిఖీ చేశాం. 25 బస్సులను ఫిట్నెస్ లేదని నిలిపేశాం.అయితే కొన్ని బస్సులకు పెయింటింగ్ లేకపోవడం వల్ల డొక్కుగా కనిపిస్తున్నాయి. బస్సులకు పెయింటింగ్ వేసి సహకరించాలని కోరాం. ఇప్పటికే అచ్చంపేటలో ఐదు బస్సులు సీజ్ చేశాం. నెంబర్ లేకుండా ఉండే నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న 20 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశాం.

నవతెలంగాణ : పరిమితికి మించి బరువును తీసుకెళ్ళడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయి కదా ?

డీటీఓ : వాహనాలు పరిమితికి మించి బరువును తీసుకెళితే ఖచ్చితమైన చర్యలు ఉంటాయి. ముఖ్యంగా రోడ్లు ధ్వంసం అవ్వడమే కాక ప్రమాదానికి కారకులు అవుతారు. రోడ్లలో చైన్ బ్లాక్ వాహనాలు కేజీ వీల్స్ తిప్పరాదు. ప్రభుత్వ నిబంధనలను సలహాలను స్వీకరించి సహకరించాలని కోరుతున్నాం.

నవతెలంగాణ :వాహనదారులు ఎటువంటి ధృవపత్రాలు కలిగి ఉండాలి ?

డీటీఓ :ముఖ్యంగా కమర్షియల్ వాహన దారులు మూడు నెలలకు ఒకసారి ప న్నులు చెల్లించాలి. వాహనాన్ని ఫిట్నెస్ చేయించుకోవాలి. ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి. ప్రతి వాహనానికి ఆర్సీతో పాటు లైసెన్సులు తప్పనిసరి. పొల్యూషన్ ధృవపత్రం కలిగి ఉండాలి.

నవతెలంగాణ :జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి ?

డీటీఓ : జిల్లాలో 20 లక్షల వాహనాలు ఉన్నాయి.90 వేలు నాన్ ట్రాన్స్పోర్ట్ కు చెందిన కార్లు బైకులు ఉన్నాయి. ఆటో రిక్షాలు 5000 కూడా 20వేల ట్రాక్టర్లు 200 స్కూల్ బస్సులు 340 ఆర్టీసీ బస్సులు ఇతర గూడ్స్ బండ్లు ఐదువేల వరకు ఉన్నాయి.

నవతెలంగాణ : పన్నుల వసూల్లలో మీ టార్గెట్ ఎంత

డీటీఓ : ప్రభుత్వ నిబంధనల మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి 45 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. వివిధ రకాల పన్నులు జరిమానాల ద్వారా ఈ ఆదాయాన్ని సేకరించాల్సి ఉంది.

మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి : బీఆర్ఎస్

మహబూబ్ నగర్ : బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రంలో కుకీ తెగ గిరిజన మహిళలపై జరిగిన అమానవీయ సంఘటన సమస్త మానవజాతికి తలవంపులు తెచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ అక్కడి ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని, రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని కోరారు. సంఘటన జరిగి దాదాపు 80 రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్మార్గమైన సంఘటనకు మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని, రాష్ట్ర డీజీపీలను బాధ్యులను చేస్తూ వారి పేర్లను నిందితుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరితో వ్యవహించిందని ఆరోపించారు. సోషల్ మీడియా ద్వారా మాత్రమే ఈ దుర్మార్గం వెలుగు చూసిందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తన స్వార్థపూరిత రాజకీయం కోసం మణిపూర్ రాష్ట్రంలో మతం మంటలను రాజేసిందని విమర్శించారు. మేటీ, కుకీ తెగల మధ్యన ఘర్షణలు సృష్టించిందని, ఈ క్రమంలోనే కుకీ తెగకు చెందిన అమాయక గిరిజన మహిళలపై కీచకపర్వం కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న హింసను నిరసిస్తూ పౌర సమాజం కూడా స్పందించాల్సిన అవసరం, బాధ్యత ఉందన్నారు.

కార్మిక గర్జనకు తరలి రావాలి : ఐఎఫ్‌టీయూ

ఆత్మకూరు : ఆగస్టు 4వ తేదీన హైదరాబాదులో జరిగే కార్మిక గర్జన విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు పేర్కొన్నారు. శనివారం అమరచింత మండలంలోని మస్తీపురం గ్రామంలో ఇట్టి గర్జనకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు రాష్ట్రంలో 20లక్షల మంది కార్మికులు ఉంటారని, వీరి సంక్షేమం కోసం పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైతున్నదని, భవన కార్మికులకు మోటార్ సైకిల్ ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలైనా ఊసే లేదని విమర్శించారు. అలాగే కార్మికులు సహజ మరణం చెందితే రూ.5లక్షల ప్రసూతికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, డిప్యూటీ లేబర్ కమిషనర్, సిబ్బందినీ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల కార్యదర్శి మన్యం, మండల నాయకులు శ్రీను, నాగరాజు, కృపాకర్, దేవన్న, బాలు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



పెబ్బేరు : వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని శాఖాపూర్ వై, గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త పింజరి హుస్సేన్ గుండెపోటుతో బుధవారం రాత్రి మరణించిన విషయం తెలుసుకొని మంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని పరామర్శించి మంత్రి పంపించిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారని బీఆర్ఎస్ పెబ్బేరు మండల అధ్యక్షులు వనం రాములు యాదవ్ అన్నారు. వారితో పాటు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, వైస్ ఎంపీపీ కోట్ల బాల్‌చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సందెపాగ వెంకటయ్య, పగుడాల కృష్ణ, పరమేష్ నాయి, మర్యాద సందీప్‌రెడ్డి, మంగరాయి మన్యం, తోమాలపల్లే మధు, చిన్నపాగ రామకృష్ణ, గువ్వల గోపి, సాయి నాయి, చేగుంట సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు : కలెక్టర్

వనపర్తి : జిల్లాలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండ కురుస్తున్న వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, అస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాల వల్ల రహదారులపై అడ్డంగా నీరు పారే ప్రాంతాలను గుర్తించి ప్రమాద తీవ్రతను బట్టి ప్రజలు రహదారి దాటకుండా బారికేడ్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా వర్షాలకు కొత్తనీరు ప్రవహించే వాగులు వంపులు, కాలువలు లేదా ప్రాజెక్టుల వంటి ప్రదేశాలలో చేపలు పట్టే జాలర్లు, యువకులు సాహసాలు చేస్తారని, విద్యార్థులు ఆయా ప్రాంతాలను చూడడానికి వస్తుంటారన్నారు. అలాంటప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్థానిక అధికారులు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్న సమయంలోనే కాకుండా ఆ తర్వాత కాలంలో వర్షాలకు తడిసి పాత మిద్దెలు కూలిపోయే అవకాశం ఉందని వాటిని గుర్తించి అలాంటి కుటుంబాలను శిబిరాలకు, ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉందని వెంటనే పంచాయతీరాజ్ అధికారులు సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో చెత్త ప్లాస్టిక్‌తో పేరుకుపోయి ఉన్న డ్రైనేజీల వల్ల ఎక్కువగా ఇబ్బందులు వస్తాయని వీటిలో నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు తగ్గ మిషనరీ ని అందుబాటులో ఉంచుకోవాలని జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే మరమ్మతులు చేస్తున్న రహదారుల వద్ద కానీ వివిధ భవనాల వద్ద కానీ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి సూచనల బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో టీంలు ఏర్పాటు చేసుకొని రాత్రి సమయాల్లో సైతం చురుకుగా ఉండాలని అన్నారు. వర్షాల కారణంగా తాగు నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున నీటి పరీక్షలు నిర్వహించేందుకు మిషన్ భగీరథ అధికారులు కావలసిన పరికరాలను సమకూర్చుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం తీసుకొని మంచినీరు సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు సైతం కావలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించాలన్నారు. ఆదివారం సైతం అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కె.తిరుపతిరావు, జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, జెడ్పీ సీఈవో శ్రావణ్ కుమార్, ఆర్డీవో పద్మావతి, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఈఈ, ఆర్అండ్‌బీ ఈఈ, జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దేవాలయ హుండీలో రూ.2లక్షల చోరీ



ఆత్మకూర్ : అమరచింత మండల పరిధిలోని కృష్ణంపల్లి గ్రామ అంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి హుండీలో రెండు లక్షల రూపాయలు చోరీ గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారి వివరాల ప్రకారం రాత్రి తెల్ల కారులో మంచిగా దర్శనానికి వచ్చినట్లు దర్జాగా వచ్చి తాళాలను తొలగించి హుండీని తొలగించి అందులోని డబ్బులను ఇద్దరు వ్యక్తులలో ఒక మహిళ వచ్చి రెండు ప్లాస్టిక్ సంచుల్లో డబ్బులు తీసుకొని వెళ్ళినట్లు సీసీటీవి ఫుటేజ్ ద్వారా తెలుస్తుందని పేర్కొన్నారు. ఇట్టి విషయమై దేవాలయంకు వెళ్లినవారు ఉదయం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు హుండీలో రెండు లక్షలు ఉన్నట్టు వారు తెలిపారు. ఇట్టి విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా దేవాలయంలో అమర్చిన సీసీ కెమెరాల ఆధారంగా సీసీ పోటీజీని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

సభ్య సమాజం తలదించుకునేలా మణిపూర్లో మహిళల పరిస్థితి

- తక్షణం మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి
- దేశంలో క్షీణిస్తున్న ఆర్థిక వ్యవస్థ
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.అబ్బాస్



వనపర్తి : సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్ రాష్ట్రంలో మహిళల అర్ధనగ్న ప్రదర్శన చోటు చేసుకోవడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డీ.అబ్బాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై చెలరేగుతున్న దౌర్జన్యాలు అరికట్టే చర్యలు తీసుకోకుండా నిందితుల వైపు మద్దతుగా ఉన్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక వైపు 'భేటీ బచావో- భేటీ పడావో' అంటున్న బీజేపీ నాయకుల పాలనలో సామాన్య గిరిజన మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది మహిళలను ఇదే విధంగా అవమానించిన ఘటనలు గత 80రోజులుగా కొనసాగుతున్నాయని స్వయానా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ మాటలు అక్కడి బీజేపీ ప్రభుత్వ మనువాద వైఖరిని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనలు బయటికి రాకుండా ఇంటర్నెట్ సేవలను 80రోజులుగా నిలిపివేశారని చెప్పారు. దీనితో నిందితుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. ఈ ఘటనలపై తక్షణం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. జూన్ 6వ తేదీన ఇద్దరు కుకీ తెగ మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులను నిన్న పార్లమెంటులో ప్రతిపక్షాలు నిలదీసే వరకు అరెస్ట్ చేయని అక్కడి బీజేపీ సి.ఎం. బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. రాజ్యాంగాన్ని అమలు చేయకుండా అర్. ఎస్.ఎస్.,మనువాద సిద్ధాంతాలను అమలు చేస్తున్న బీజేపీ విధానాలపై సుప్రీం కోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేశాక గత్యంతరం లేక కొందరు నిందితులను అరెస్ట్ చేశారన్నారు. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక పురోగతి దిగజారుతోందన్నారు. దేశంలో సరళీకరణ, ప్రైవేటీకరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు దేశానికి నష్టం కలిగిస్తున్నాయన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి దేశానికి లక్ష కోట్ల అప్పులు చేయడం తప్ప మేలు చేసిందేమీ లేదని ఘాటుగా విమర్శించారు. అలాగే ప్రధాని మోడీ సమస్యల్లో ఉన్న ఈ దేశాన్ని పట్టించుకోకుండా విదేశీ పర్యటనలతో బిజీగా గడుపుతూ గౌరవ ఆతిథ్యం పొందుతున్నారని తెలిపారు. విదేశాల్లో పర్యటించడానికి ప్రధాని అయినట్లుగా ఆయన కార్యక్రమాలు ఉంటున్నాయని విమర్శించారు. దేశంలో అన్ని రకాల నిత్యావసరాల ధరలు పెరిగాయని, ప్రజలు కొనుగోలు శక్తి లేక అల్లాడిపోతుంటే ప్రధాని అయిన మోదీ పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా చూసినా నియంతృత్వం, మతోన్మాదం పెచ్చరిల్లేలా కేంద్రం అడుగులు వేస్తోందని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో ఉన్న పరిస్థితులను తీసుకొ చ్చేందుకు ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో పగ్గాలు చేపట్టిన మోడీ రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. మతాన్ని రాజకీయానికి అంటకడుతూ దేశంలో హిందూయిజం మాత్రమే ఉండాలంటూ హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెడుతూ మత ఘర్షణలకు ప్రేరేపిస్తున్నారన్నారు. దేశంలో అత్యున్నత స్థానం, గిరిజన తెగకు చెందిన మహిళా ప్రజా ప్రతినిధికి రాష్ట్రపతి హోదా కల్పించినా ప్రభుత్వ కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కొత్తగా పార్లమెంట్ భవనాన్ని నిర్మించి ప్రారంభిస్తే రాష్ట్రపతిని ఆహ్వానించలేదని తెలిపారు. దేశంలోని సమస్యలపై చర్చించాల్సిన ఉభయ సభలకు రాష్ట్రపతికి ఆహ్వానం పంపలేదని చెప్పారు. ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న, దేశంలో రైతులకు కార్మిక రంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్టా ఆంజనేయులు, బాల్‌రెడ్డి, జీఎస్.గోపి, మేకల ఆంజనేయులు, ఏ.లక్ష్మి, పార్టీ జిల్లా మండల ప్రాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయి చంద్ విగ్రహ ఏర్పాటుకు దీక్ష



ఆత్మకూరు : అమరచింత పట్టణంలో శనివారం తెలంగాణ ఉద్యమ నాయకుడు దివంగత సాయిచంద్ విగ్రహం హైదరాబాదులో ఏర్పాటు చేయాలని బహుజన సంఘ సభ్యులు ఆధ్వర్యంలో అమరచింతలు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అంబేద్కర్ జాతర కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మంత్రిమండలిలో సాయిచంద్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేసి ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో బహుజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మతం ఉన్మాదంగా మారితే మారణ హోమమే

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మిరియం వెంకటేశ్వర్లు



మతం మనిషికి ఉన్మాదంగా మారితే మారణ హోమమే జరుగుతుందని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మతోన్మాదంపై ప్రసంగించారు. చరిత్ర తెలుసుకోకుండా నేటి బీజేపీ ఆర్ఎస్ఎస్ నాయకులు మతం పేరుతో నానా అబద్దాలాడుతూ ప్రజలను, యువతను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. స్వాతంత్ర ఉద్యమానికి ముందు మతతత్వ రాజకీయాలు జరగలేదని తెలిపారు. స్వాతంత్రానికి ముందు ఉన్న ఆర్ఎస్ఎస్ సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించింది అన్నారు. కానీ మరికొన్ని ఇతర సంస్థల పేరిట పిడి సావర్కర్ అనే వ్యక్తి మతం ప్రాతిపదికనే దేశంలో హిందూ ముస్లింల మధ్య విభేదాలు పొడసుపేలా రాజకీయానికి మతోన్మాదాన్ని ముడి పెట్టారని తెలిపారు. మనదేశంలో బీజేపీ సీనియర్ నాయకులు అద్వాని ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర సందర్భంగా 1992లో మతాన్ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారన్నారు. రామున్ని చూడండి.. కమలానికి ఓటెయ్యండి అంటూ అప్పట్లో ఆయన చేసిన రథయాత్ర మత ఘర్షణలకు ప్రాణం పోసినట్లు అయిందన్నారు. ఏ దేశంలో లేని దేవుళ్ళు ఆత్మలు దేవతలు ఒక్క భారతదేశంలోనే వెలిశాయని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ కూడా భారతదేశంలోనే ఉందన్నారు. భారతదేశంలో స్వాతంత్ర సంఘం లో చోటు చేసుకున్న పరిణామాల దృష్ట్యా భారత్ పాకిస్తాన్ విడిపోయాయని, అంతకుముందు ఒకే దేశంగా ఉండేది అన్నారు. మౌఢ్యం చాందసంగా మారకూడదు అని, మతం ఉన్మాదంగా మనిషికి తలకెక్కకూడదని చెప్పారు. భారత రాజ్యాంగం అన్ని మతాలకు సమాన హక్కులను కల్పించిందన్నారు. రాజ్యాంగానికి లోబడి వ్యవస్థలన్నీ పనిచేయాలని అన్నారు. శాస్త్రీయతకు నిలబడని ఏ అంశాన్ని మనిషి గుడ్డిగా నమ్మరాదని చెప్పారు.

కాంగ్రెస్ లో చేరిక

వీపనగండ్ల : మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బీఆర్ఎస్ మండల నాయకులు ఎత్తం కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం హైదరాబాదులోని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నివాసంలో కృష్ణయ్య తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మల్లు రవి, టీపీసీసీ సభ్యులు అభిలాష్‌రావు, తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్‌లో నిలిచేది నేనే.. గెలిచేది నేనే!

వీపనగండ్ల : కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచేది నేనే కార్యకర్తలు, నాయకులు, ప్రజల ఆశీర్వాదంతో గెలిచేది నేనేనని టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని సంగినేనిపల్లిలో భాస్కర్‌రెడ్డి ఇంట్లో వీపనగండ్ల, చిన్నంబావి, పానగల్ మండలాల ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో తిరుగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, పార్టీ గెలిచే లక్ష్యంగా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సోలాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాముయాదవ్, చిన్నంబావి మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకుడు భాస్కర్‌రెడ్డి, ఖాదర్, తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికులతోనే స్వచ్ఛ తెలంగాణ సాధ్యం : సీఐటీయూ


నవతెలంగాణ -వనపర్తి

గ్రామపంచాయతీ కార్మికులు ప్రతి గ్రామాన్ని పట్టణాన్ని పరిశుభ్రం చేయడంతోనే స్వచ్ఛ తెలంగాణ సాధ్యమైందని, అలాంటి కార్మికులను విస్మరించడం ప్రభుత్వానికి తగదని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ రాములు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్ రాములు మాట్లాడుతూ స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీల పాత్ర పోషిస్తు, జనారోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి గ్రామ పంచాయతీ కార్మికులు పనిచేశారని తెలిపారు. అలాంటి వారికి 11వ పిఆర్సి జీవో నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు 15,600, కారోబార్ బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు 19500 రూపాయలు వేతనం ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా 10 లక్షలు, సాధారణ మరణానికి ఐదు లక్షలు బీమా కట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ 17 డిమాండ్లతో గత కొంతకాలంగా ప్రభుత్వానికి విన్నవించుకున్న చెవిటివానిలా వ్యవహరించడం తో అనివార్యంగా సమ్మె చేస్తున్నారని తెలిపారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న, కనీస వేతనాల చట్టం అమలు కాక, సెల్యూట్ సన్మానాలతో సరిపెడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంగా కేసీఆర్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిస్టం రద్దుచేసి అందరిని రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి ఇచ్చిన మాట తప్పినాడని వారు గుర్తు చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్ 26 తీర్పు ఇచ్చిన రాష్ట్రంలో అమలు చేయలేదని వారు తెలిపారు. సఫాయి కార్మికులు సిఫాయిల్ల ఉద్యమిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని అన్నారు. వనపర్తి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు రామ్ చంద్రయ్య, సాయన్న, నర్సమ్మ, బలకిస్టయ్య, దాసు, తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో : తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న జనారోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు 11వ పిఆర్సి జీవో నెంబర్ 60 ప్రకారం సపాయి కార్మికులకు 15600 కారోబార్ బిల్ కలెక్టర్ ట్రాక్టర్ ట్రాక్టర్ డ్రైవర్లకు 19500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు ప్రమాద బీమా 10 లక్షలు సాధారణ మరణానికి 5 లక్షల బీమా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు రాష్ట్ర జేఏసి 17 డిమాండ్లతో గత కొంతకాలంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు కృష్ణారెడ్డి బాలకృష్ణ చిట్టెమ్మ రాములు రమణమ్మ తదితరులు ఉన్నారు.

కొత్తకోటలో : గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 17వ రోజు సందర్భంగా కొత్తకోట మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు సమ్మె చేస్తున్న కార్మికులతో వనపర్తి సీఐటీయూ జిల్లా సహయ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు 11వ పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్ రూ.19వేలు ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.10లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కొత్తకోట మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు, భాస్కర్, కరీం, బొజ్జన్న, సహదేవుడు, అప్పరాల పరమేష్, రాముడు, రవి, అలివేల, అరుణ, చిన్నమ్మ, తదితరులు సమ్మెలో ఉన్నారు.



ఘనంగా దాశరథి 98వ జయంతి వేడుకలు



వనపర్తి : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో దాశరథి 98వ జయంతి వేడుకలను టీజేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించి ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ నిజం నిరంకుశంపై తన కలంతో గర్జించిన విప్లవ యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు అని ఆయన సేవలను గుర్తు చేశారు. బాల్యం నుంటే పద్యాలు రాయడం మొదలుపెట్టిన కృష్ణమాచార్యులు పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్నో రచనలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండ్ల దేవన్న నాయుడు, బూరోజు గిరిజాచారి, నాయకంటి నరసింహ శర్మ, పరమేశ్వర చారి, డప్పు నాగరాజు, జీఎస్.గోపి, తదితరులు పాల్గొన్నారు.

సీజల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

నవతెలంగాణ -వనపర్తి

వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీర్లగుట్ట మెడికల్ ఆఫీసర్ బి. వైష్ణవి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఐఎఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ బిసి వసతి గృహాలలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహంలోని ఆవరణ చుట్టూ పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి మాధవిని ఆదేశించారు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలన్నారు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, మరియు డెంగు మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు



సహజంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభల్లే అవకాశం ఉన్నందువలన విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు వర్షాకాలం వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల వల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగు, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రభల్లే అవకాశం అధికంగా ఉంటుందని వసతి గృహంలోని వంటగది పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వసతి గృహ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వైష్ణవి, వసతి గృహ సంక్షేమ అధికారి మాధవి మెడికల్ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఐక్యంగా పోరాడుదాం : సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్

కందనూలు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘాల ఐక్య జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియు ఎఐటియుసి ఐఎన్‌టియుసి తదితర సంఘాలు పాల్గొని ఐక్య పోరాటానికి సంఘీభావం తెలుపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 8 సంవత్సరాల కాలంలో 44 కార్మిక చట్టాలను నాలుగు కొడులుగా మార్చి కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల దాదాపు 18 రోజులుగా సమ్మె చేస్తున్న, స్కూల్ స్వీపర్లు 32 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వ మాత్రం ఏమాత్రం వారి సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు కార్యక్రమంలోసీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వర్ధన్ పర్వతాలు, జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య ,జిల్లా కోశాధికారి గుంపల్లి అశోక్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, రాము, స్వీపర్ల సంఘం జిల్లా కోశాధికారి అర్జున్, ఐకెపి వివో ఏ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజకుమార్ ,తిరుపతయ్య కాసిం, వెంకటమ్మ, బాల స్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



'న్యాయస్థానాల్లో కేసులు సత్వరమే పరిష్కరించాలి '

కందనూలు :న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ కోర్టు న్యాయమూర్తి డి రాజేష్ బాబు అన్నారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయవిభాగానికి సంబందించిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులు ఎందుకు సమయానుకూలంగా పరిష్కరించలేక పోతున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను, సూచనలను తెలియజేశారు. న్యాయస్థానాల్లో నాన్ బేయిల్ వారంట్లను తక్షణం అమలు చేసి సాక్షులను సంబంధిత న్యాయస్థానాల్లో హాజరు పర్చాలని పోలీస్ అధికారులకు, పబ్లిక్ ప్రాసి క్యూటర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తమ పరిశీలనలో ఉంది జాప్యానికి సంబంధించిన వివిధ కేసులపై వారి వారి అభిప్రాయాలను జిల్లా న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. కార్య్రక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సభితా, అదనపు జూనియర్ సివిజడ్జి ప్రవీణ్, మౌనిక అదనపు స్పెషల్, పబ్లిక్ ప్రసిక్యూటర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి అండగా ఐక్యత పౌండేషన్

వెల్దండ : వెల్దండ మండల పరిధిలోని ఉబ్బలగట్టు తండాకు చెందిన సక్రు గుండెపోటుతోమృతి చెందారు. మృతుని కుటుంబానికి ఐక్యత ఫౌండేషన్ నాయకులు శనివారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సమకూర్చిన రూ. 5 వేల నగదును ఫౌండేషన్ సభ్యుల ద్వారా అందించారు.కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఏ మాత్రం అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో. పోచమ్మ గడ్డ తండా సర్పంచ్ వరలక్ష్మి పంతుల నాయక్ , వెంకట్ నాయక్ , దేవీలాల్, జయరాం నాయక్ , శ్రీను, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవ తెలంగాణ- కందనూలు

సీజనల్ వ్యాధులపై ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్లకు శనివారం అవగాహన కార్యక్రమం కాన్ఫరెన్స్ హాల్ న్యూ కలెక్టరేట్ నాగర్ కర్నూల్ లో నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధులపై నాగర్ కర్నూల్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని ప్రైవేట్ లాప్ టెక్నీషియన్లకు అన్ని రకాల వ్యాధులపై అవగాహన కల్పించి వారి వద్ద వచ్చిన రోగ నిర్ధారణ పరీక్షలు ఎప్పటికప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి సమాచారం అందించాలని జిల్లా వైద్యాధికారి తెలిపారు. జిల్లా ఉపా వైద్యాధికారి డాక్టర్ వెంకదాస్ మాట్లాడుతూ సీజన్ వ్యాధుల సమాచారం కొరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కమాండ్ కంట్రోల్ హెల్ప్ లైన్ నెంబర్ను సంప్రదించాలని ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లకు తెలిపారు జిల్లా సహాయ మలేరియా అధికారి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రోగ నిర్ధారణ పరీక్షలు నాణ్యమైనవిగా ఉండాలని లేదంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోజిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ లాల్. నాగర్ కర్నూల్ డివిజన్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వెంకట దాస్ తో పాటునాగర్ కర్నూల్ డివిజన్ పరిధిలో ఉన్న 50 మంది ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లు డాక్టర్ ప్రదీప్ కుమార్. డి పి ఎం ఓ రేనయ్య. జిల్లా సహాయ మలేరియా అధికారి ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారుటు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిషేధిత భూమిని టీఆర్ఎస్ పార్టీ నాయకునీ పేరు మీద మార్పిడి.

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ ఆరోపణ

నవ తెలంగాణ- అచ్చంపేట

మండల పరిధిలోని చెన్నారం రెవిన్యూ గ్రామ పంచాయతీ పరిధిలోని 27/ఆ 27/ఆ2 సర్వేనెంబర్ లో భూదాన భూములను, ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్నటి భూములను టిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పేరు మీద ధరణిలో నమోదు చేసుకోవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ ఆరోపించారు. శనివారం ఈ విషయం పైన తహసీల్దార్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. పత్రిక విలేకరుల మాట్లాడారు. అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వాటిని ధరణి పేరుతో నిషేధ జాబితలో పెట్టి. అవకాశం వచ్చినప్పుడు భయపెట్టి అధికారులను భయపెట్టి తమ పేర్లు మార్చుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి : కేవీపీఎస్

నవతెలంగాణ తాడూర్



అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి. కాశన్న అన్నారు. తా దూరు మండలం ఎటిదర్ పల్లి గ్రామంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ ఎటిదర్ పల్లి గ్రామంలో రాజకీయ నాయకుల అండదండలతో గ్రామంలో రాత్రివేళ ఇష్టం సారంగా అనుమతి లేకుండా అక్రమ ఇసుకను తరలిస్తూన్నారని ఆరోపించారు. ఒక ట్రిప్పుకు 5000 ,6000, ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామ ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోకపోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు అక్రమ ఇసుకను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహ, రఘు, కిష్టయ్య ,భీమయ్య ,తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో నీటి ఎద్దడి నివారణకు ఐక్యత ఫౌండేషన్.. కృషి

నవ తెలంగాణ వెల్దండ



వెల్దండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి ఐక్యత ఫౌండేషన్ ముందుకొచ్చింది. పాఠశాల ఆవరణలో బోరు బావి ఉన్న మోటర్ లేకపోవడంతో విద్యార్థినిల అవసరం దృశ్య ట్యాంకర్ల ద్వారా పాఠశాల విద్యార్థులకు నీళ్లు అందిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా వచ్చే చాలీచాలని నీటి తో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకి రాఘవేందర్ రెడ్డి ముందుకు వచ్చి రూ . 30 వేల విలువ గల త్రీ ఫేస్ మోటర్ ను , నూతన స్టార్టర్ డబ్బాను పాఠశాలకు అందజేసి ఫౌండేషన్ సభ్యులు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినిలు విద్యార్థులు నీటి వసతి కల్పించిన రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరగడ్డ సర్పంచ్ దశరథ్ నాయక్, పోచమ్మ గడ్డ సర్పంచ్ వరలక్ష్మి పంతుల నాయక్, ఎస్ టి సెల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జైరాం నాయక్, లక్ష్మణ్ నాయక్, కృష్ణయ్య భీమ్యా , పర్వతాలు యాదవ్, శంకర్, రాజు, శ్రీను, రమేష్ నాయక్ , పాఠశాల అధ్యాపకురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం..

వెల్దండ : వెల్దండ మండలం అల్లంతోటబాయితండా పరిధిలోని రామోజీ తండాకు చెందిన రాత్లావత్ సక్రి మృతి చెందింది . సక్రి కుటుంబ సభ్యుల ను టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుమారుడు హన్మంతు నాయక్ కు అంత్యక్రియ ల నిమిత్తం రూ . 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టి కాడురామ్ నాయక్ , నాయక్ సర్పంచ్ కుమార్ నాయక్, ఉప సర్పంచ్ శ్రీను నాయక్ , మార్కెట్ డైరెక్టర్ రవీందర్ నాయక్ , హెల్పర్ రవి నాయక్ ,తుకారం నాయక్ రామచందర్ నాయక్ ,సుదీర్ ఉన్నారు.

జిల్లాలో పండ్ల తోటలను ప్రోత్సహించాలి: కలెక్టర్

నవతెలంగాణ- కందనూలు

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకం అందిస్తుందని, జూలై 31 నాటికి జిల్లాలో 2565 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతుల వివరాలను గుర్తించి ఉపాధి హామీ పథకంలో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు.శనివారం నాగర్ కర్నూల్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలో సాగుకు తీసుకోవాల్సిన చర్యలు, వర్షాకాలం సీజన్ వ్యాధులపై అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ ఎంపీడీవోలు ఎంపిఓలతో సమావేశం నిర్వహించారు. పండ్ల తోటల సాగుకు సంబంధించి ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన శాఖతో కలిపి చేపట్టే చర్యలను వివరిస్తూ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ను అధికారులు ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పండ్ల తోటల సాగు ప్రోత్సహించి, దానికి అవసరమైన పెట్టుబడిని రైతులకు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా నాగర్ కర్నూలు జిల్లాలో 2565 ఎకరాలలో పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం, పీ.ఎం.కే.వై.సి పథకాలను విని యోగించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉద్యానవన శాఖ పంటల కింద నాగర్ కర్నూల్ జిల్లాలో ఇప్పటికే 15197 మంది రైతులు 35975 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర రావు, డి ఆర్ డి ఓ నర్సింగ్ రావు, డిపిఓ కృష్ణ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అడిషనల్ డి ఆర్ డి ఓ రాజేశ్వరి డి ఎల్ పి ఓలు రామ్మోహన్రావు, పండరినాథ్ ఎంపీడీవోలు, ఎంపీ ఓలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపన పై ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశం

పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక్కులను మరింత మంది ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత కలెక్టరేట్ లోని చాంబర్లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపన పై ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...టీఎస్ ఐపాస్ చట్టం క్రింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతి మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. టీ ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల దరఖాస్తులను వాహనాలకు సంబంధించి సబ్సిడీ మంజూరు కి అనుమతి ఇవ్వడం జరిగింది అన్నారు. అందుకు కావలసిన 70 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమ శాఖ అధికారి రవి కిరణ్, డిటిపిసి శేఖర్, జిల్లా భూగర్భ జల అధికారిని రమాదేవి ఆర్టీవో ఎర్రి స్వామి లీడ్ బ్యాంకు మేనేజర్ కౌషల్ కిషోర్ పాండే పాల్గొన్నారు.



ధూమపానం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలి

పొగాకు రహిత జిల్లా యే లక్ష్యంగా ఆయా శాఖల అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలోనేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ,పోలీస్,కార్మిక,విద్య,తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగించకుండా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. పొగాకు అలవాటు మానడానికి 1800 11 2356/011 22901701 లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కే మనోహర్, డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్, డీఈవో గోవిందరాజులు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

విద్యార్థులలు, యువత మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలన చేపట్టాల్సిన చర్యలపై నార్కో కోఆర్డినేషన్(ఎన్కార్డ్) జిల్లా స్థాయి కమిటీ మొదటి సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్, ఎస్పి జిల్లాలో విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడకుండా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి . ఉదయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల, నియంత్రణ అక్రమ రవాణా, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎన్కొఆర్డ్ జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ కే. మనోహర్ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో గుర్తించిన డ్రగ్ అడిక్షన్ కేసులు వివరాలను ఆరా తీశారు. సమావేశంలో ఎస్పి కే మనోహర్ ,జిల్లా క్రైమ్ డిఎస్పి సత్యనారాయణ, డి.ఎం.హెచ్.ఓ. సుధాకర్, డిపిఓ కృష్ణ, డి.ఈ.ఓ గోవిందరాజులు, నాగర్ కర్నూల్ డీఎస్పీ మోహన్ కుమార్ కల్వకుర్తి డి.ఎస్.పి నరసింహ అచ్చంపేట డి.ఎస్.పి కృష్ణలు మున్సిపల్ కమిషనర్, ఆర్టీసీ ఆర్ఎంఓ చందు నాయక్, నాగర్ కర్నూల్ డిఎంఓ, పోలీసు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



- సీఐటీయూ ,కాంగ్రెస్ , టీడీపీనాయకులు
- గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సీపీఐ(ఎం),ప్రజా సంఘాల నాయకులు ,కాంగ్రెస్ నాయకులు సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ -వంగూర్

మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపింది సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ ప్రభుత్వం అంగీకరించి జీవో 51ని రద్దు చేసి జీవో 60 ప్రకారం కార్మికుల కనీస వేతనం 19వేలు ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ వంగురు మండల కార్యదర్శి బాలస్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి శివరాములు, మండల కమిటీ సభ్యులు దార్ల శ్రీను, పులిజాల అశోక్ గోవర్ధన్, సిఐటియు మండల నాయకులు పరుష రాములు, ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి , పులీజాల బాలిశ్వర్, రజకవృతి దార్ల సంఘం జిల్లా వుపా అధ్యక్షుడు కృష్ణయ్య గ్రామ పంచాయతీ కార్మిక యునియా న్ మండల అధక్షులు మొగులాన్ కార్యదర్శి లింగమయ్య, మండల నాయకులు పులిజాల ఆంజనేయులు, రేణుక, బాలయ్య, రామస్వామి, జనార్ధన్ , ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ : గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి ఈశ్వర్ కొల్లాపూర్ మండల కేంద్రం లోని ఆర్డిఓ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ వర్కర్లు చేస్తున్న సమ్మె 17 రోజులుగా సమ్మె చేస్తా ఉన్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ విమర్శించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలస్వామి, చంద్రమ్మ, సత్యం , ఆశన్న, మండలంలోనివివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

బల్మూరు : తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులు గత 17 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని వెంటనే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బల్మూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల 17వ రోజు నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంఘీభావం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ ఖదీర్ నాయకులు చంద్రమౌళి, వెంకటయ్య, గణేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శంకరనాయక్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు శంకర్ రాంబాబు ముస్తఫా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని నాగర్ కర్నూల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ మహేష్ అన్నారు శనివారం తెలకపల్లి మండల కేంద్రంలోనీ నెహ్రూ చౌరస్తాలో తెలంగాణ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 17వ రోజుకు చేరుకున్నది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కోడేరు : మండల కేంద్రంలో శనివారం బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈనెల 6 నుంచి జరుగుతున్న నిరవధిక సమ్మె లో భాగంగా 17వ రోజు గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను గుర్తించి పర్మనెంట్ చేసి జీతాలు పెంచాలని వినూతనంగా ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బి రాములు , ప్రధాన కార్యదర్శి ఎస్ సాయిబాబు, ఉపాధ్యక్షులు ఎం శేఖర్, సహ కార్యదర్శి ఎండి కాజా, కోశాధికారి ఏసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పదర: ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ సిబ్బంది ఈనెల 6 నుండి నిరవధిక సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే సమ్మె ప్రారంభించి శనివారం నాటికి సమ్మె 17వ రోజుకు చేరింది, పదర మండల కేంద్రంలో ఈరోజు గ్రామపంచాయతీ సిబ్బంది ఒంటి కాలు తో సమ్మె చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది సంఘం మండల అధ్యక్షులు కొయ్యల ఆంజనేయులు,ఉపాధ్యక్షులు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి రాజయ్య, ఎల్లమ్మ, బాలయ్య, ఎల్లయ్య సైదులు, దశరథం, జాంగిర్, శ్యామ్, సైదులు, చందు, సీతారాం రెడ్డి, సరోజ, నందు పాల్గొన్నారు,,

పెద్దకొత్తపల్లి : మండల కేంద్రంలో ఈనెల 6 నుంచి చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెను ఎన్ని ఆటంకులు వచ్చినా కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఆపేది లేదని, సమ్మె ఉధృతం చేస్తామని మండల సిఐటియు మండల కన్వీనర్ ఇంద్రకంటి బాలస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చంద్రయ్య, ఉపాధ్యక్షులు సిద్దయ్య, గ్రామపంచాయతీ కార్మికులు జి గణేష్, ఉదయ్ కుమార్ ,ఏ మల్లేష్ ,మహేష్ ,కె నరసింహ, టి రాములు, బిచ్చన్న సిద్ధిరాములు సాతాపూర్ లక్ష్మయ్య ,ఎల్లమ్మ ,చేన్నమ్మ చంద్రకళ నాగేంద్రమ్మ, బోనాసి చెన్నమ్మ, జంపులు, జలాల రేణుక, వి రాజు, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్ల వెల్లి : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కు సంపూర్ణ మద్దతు తెలిపిన కొల్లాపూర్ నియెజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పగిడాల శ్రీనివాసులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్య కార్మికుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యారంగాని విస్మరిస్తున్న ప్రభుత్వం : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ కందనూలు

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో విజేత జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ మాట్లాడుతూవిద్యాసంస్థలను ప్రారంభమై రెండు నెలలు గడుస్తా ఉన్న హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా హాస్టల్లో గాలికి వదిలేసిందని వారన్నారు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.విద్యారంగానికి నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైతుందని విద్య అభివృద్ధి, నిధులు కేటాయించకుండా రాష్ట్ర విద్యారంగ ప్రగతి ఆగిపోయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో 24,000 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయలేదని పాఠ్యపుస్తకాలు లేకుండా, టీచర్లు లేకుండ ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం తారా సింగ్ జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్ రాజేష్ నాయకులు రామకృష్ణ తరుణ్ రవి లక్ష్మణ్ విశ్వాస్ అభిషేక్ గోవర్ధన్ అభినయ్ తదితరులు పాల్గొన్నారు



భారత సైనికుని భార్యకు భద్రత ఇవ్వలేని బిజెపి ప్రభుత్వం..!

-భరత బిడ్డలకు ఎలాంటి భరోసా ఇస్తుంది.



అచ్చంపేట : భారత సైనికుని భార్య కు భద్రత ఇవ్వలేని బిజెపి ప్రభుత్వం..! భరత బిడ్డలకు ఎలాంటి భరోసా ఇస్తుంది అమహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రోహిణి మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, మహిళలపై అత్యాచారాలు హింసలకు తక్షణమే మహిళలకు నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. సంబంధించిననిందుతులను కఠీనంగా శిక్షించాలనీ డిమాండ్ చేశారు..బిజేపి ప్రభుత్వంలో మొన్న దళితులు, నిన్న గిరిజనులు, నేడు స్త్రీలు ఎవరికి భద్రత లేదన్నారుమణిపూర్ రాష్ట్రంలో గత మూడు నెలల నుండి అల్లర్లు, మహిళలపై అత్యాచారాలు హింస జరుగుతున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా అక్కడ ప్రజల మరణాల కారణమైందన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ మణిపూర్ రాష్ట్రంలో బిజెపి, కేంద్రంలో బిజెపి రెండు కూడా వెంటనే గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు శారదమ్మ, నియోజకవర్గ మహిళా నాయకులు విజయలక్ష్మి , సుశీల, పద్మాబాయి, కౌన్సిలర్లు మధునాగుల సంధ్య , నూరి బేగం, చిట్టెమ్మ, ఇందిరమ్మ, శ్యామలీల, భగ్యమ్మ వివిధ మండలాల మహిళా నాయకులు ఉన్నారు.

మొక్కలు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతాయి : కలెక్టర్

నవతెలంగాణ- కందనూలు

మొక్కలు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతాయని కలెక్టర్ పి ఉదయ్ కుమార్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో పచ్చని భూమి కోసం చెట్ల పెంపకం అనే కార్యక్రమం ద్వారా శనివారం నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ యూనియన్ బ్యాంక్ వారు అందించిన వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే , జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర రావు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ..

వెల్దండ : వెల్దంద మండల పరిధిలోని ఉబలగాట్టు తండ కు చెందిన వద్త్యవత్ శక్రు నాయక్ గుండె పోటు తో శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వెల్దండ మాజీ వైస్ ఎంపిపి వెంకటయ్య గౌడ్ పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతుని కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు శివలల్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల దరఖాస్తు తేదీ పొడిగింపు

అచ్చంపేట రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అమ్రాబాద్ యందు తాత్కాలిక పద్ధతిన అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం మదన్మోహన్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరానికి గాను కామర్స్ -2, ఇంగ్లీష్-1, హిస్టరీ-1, ఎకనామిక్స్-1, పొలిటికల్ సైన్స్-1, జువాలజీ-1, కంప్యూటర్ సైన్స్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీలో 55% మార్కులు (ఎస్సీ /ఎస్టీ అభ్యర్థులకు ఆయా సబ్జెక్టు పీజీలో 50 % మార్కులు) కలిగిన వారు అర్హులు, సెట్ / నెట్/ స్లేట్ / పీహెచ్డీ కలిగిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తెలంగాణ ప్రభుత్వం ఈనెల 20, 21, 22వ తేదీలను సెలవు దినాలుగా ప్రకటించడం జరిగినందున అతిథి అధ్యపకుల దరఖాస్తు గడువును ఈనెల 22 సాయంత్రం 4 గంటల నుండి ఈనెల 25 సాయంత్రం 4 గంటల వరకు పొడిగించడం జరిగిందనీ తెలిపారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తు అందజేయవలసిందిగా ఈ సందర్భంగా ఆయన కోరారు

బీసీ కాలనీలో సీసీ రోడ్లు వేయాలి : సీపీఐ(ఎం)

నవ తెలంగాణ -కందనూలు

మున్సిపాలిటీ పరిధిలో బిసి కాలనీలో కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని వెంటనే సిసి రోడ్లు వేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జి అశోక్ అన్నారు. శనివారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల క్రితం ఏర్పడిన బీసీ కాలనీలో కనీసం సీసీ రోడ్లు లేకపోవడంతో రాత్రి టైంలో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని వృద్ధులు మరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో మంచినీటి ఆటోలు కూడా రావడంలేదని తాగునీటి ఇబ్బంది కూడా ఎదుర్కొంటున్నారని అన్నారు మురికి కాలువలు నిర్మించిన ఉపయోగంలో లేవన్నారు. తాత్కాలికంగా మట్టి పోపించాలని వెంటనే సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అనుమగల సత్యనారాయణ ,నరసింహ, రాములు ,జాంగిర్ ,రవీందర్ ,తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కోసం డీఎంకు వినతి పత్రం..

నవ తెలంగాణ- వెల్దండ

వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం డిపో మేనేజర్ మోహన్ రెడ్డి కి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. నారాయణపూర్ గ్రామం నుండి ప్రతిరోజు ఆమనగల్లు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రైతులు రైతు కూలీలు కూరగాయలమ్మ రైతులు వందలలో వెళ తుంటారని , వారి సౌకర్యార్థం హైదరాబాదు నుండి నారాయణపూర్ గ్రామానికి ప్రత్యేక బస్సు నడపాలని వివిధ పత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో. గ్రామ సర్పంచ్. అంజి నాయక్. బీ ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు తరాషింగ్ , వార్డుమెంబర్ నరేష్ , లక్ష్మిపతి, లచ్చిరాం, రవి , గోపి , సంతోష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలి

నవతెలంగాణ కొల్లాపూర్

మణిపూర్ లో మహిళల నగ్న ఊరేగింపు బాధ్యత మోడీ సర్కార్ దుర్మార్గపు చర్య అని మణిపూర్ రాష్ట్రంలో విధ్వంస ఖాండను ఆపి వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించి శాంతిని నెలకొల్పాలని బిఆర్ఎస్వి విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు డి శేఖర్ ప్రకటనలో పేర్కొన్నారు. మణిపూర్ ప్రజలకు దేశవ్యాప్తంగా ప్రజలకు అండగా ఉండాలని తెలిపారు మణిపూర్ ముఖ్యమంత్రి బిరాన్ సింగ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేసి కుకీజాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ కొల్లాపూర్

పశు సంవర్ధక శాఖలో గత 30 సంవత్సరాలుగా కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న తనను సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కొల్లాపూర్ ఏరియా వైద్య శాఖలో కాంట్రాక్టు అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి వెంకటస్వామి శనివారం కోరారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సీఎం కేసీఆర్ శాసనసభలో ప్రకటించిన విధంగా కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న తన సర్వీసును క్రమబద్ధీకరించాలని స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారులను రాష్ట్ర పశుసంవర్ధక డైరెక్టర్ శాఖ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. తన ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని నాగర్కర్నూలు ఎంపీ పోతుగంటి రాములు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని రాష్ట్ర ఐటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కు వినతి పత్రాలు పలుమార్లు అందించామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పశువు సమర్థక శాఖ డైరెక్టర్ స్పందించి నా ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని ఆయన తెలియజేశారు.

సిఎం హామీని అమలు చేయాలి.

నవతెలంగాణ -వంగూరు

వంగూరు మండలం పరిధిలోని అన్నారం గ్రామంలో శనివారం ఎన్.పిఆర్.డి. వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్, ఉపాధ్యక్షులు దార్ల శ్రీనివాసులు మాట్లాడుతూ, జూలై నుంచి 4 వేల రూపాయల పెన్షన్ ఇస్తామని సీఎం ప్రకటించి 45 రోజులు గడిచినా ఇప్పటివరకు పెన్షన్ పెంపు జీఓ ఇవ్వలేదని, వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం ప్రకటనతో ఎంతోమంది వికలాంగులు తమకు పెరిగిన పెన్షన్ అందుతుందని ఆశపడ్డారని కానీ ఇప్పటివరకు వారి ఆశలు నెరవేరలేదని అన్నారు. సీఎం హామీ నెరవేరకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దార్ల శ్రీనివాసులు, శేఖర్, శివ, సుందర్ పాల్గొన్నారు

కూరగాయల నారుపై శిక్షణ

నవతెలంగాణ- బిజినేపల్లి

మండలంలోని వ్యవసాయ కళాశాల పాలెం ఆధ్వర్యంలో దత్తత గ్రామం అయిన గంగారంలో కూరగాయల నారు ప్రోటేష్ పెంచుకునే విధానం గురించి డాక్టర్ భాను శ్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వివరించారు. కూరగాయలలో నారు వేసుకునే దశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి ఎస్ సుమలత అసిస్టెంట్ ప్రొఫెసర్ వివరించారు రైతులతో ట్రైన్లో విత్తనం వేయించి సూచించారు. ఆ తర్వాత నేల చిక్కుడు మిరప తోటలను పరిశీలించి ఈ వర్షాలకు తెగులు నివారణకు సలహాలు సూచనలు అందించారు. కూరగాయల నారు వేసుకునే రైతులకు ట్రేలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలోని గ్రామ రైతులు పాల్గొన్నారు

లైసెన్స్ స్లాట్ బుకింగ్ పరిధి పెంచండి

జోగులాంబ గద్వాల : ఈ నెలలో తేదీ 16-7-2023 నుండి 21-07-2023 వరకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి మంచి స్పందన లభించడంతో మారుమూల గ్రామాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్స్ పొందలేని వారికి ఉచితంగా డ్రైవ్ లైసెన్స్ అందజేసి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మెగా ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమాని నిర్వహించారు. సుమారు 25,200 దరఖాస్తులు స్వీకరించారు. శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ఆర్టీఓ కార్యాలయానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్వయంగా వెళ్లి జిల్లా అధికారి పురుషోత్తం రెడ్డిని కలిసి గద్వాల నియోజకవర్గం లో నిర్వహించిన మెగా ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా గురించి చర్చించడ జరిగింది. ఇట్టి విషయాన్ని రవాణా శాఖ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ దృష్టికి తీసుకువెళ్లి స్లాట్ బుక్ పరిధిని పెంపొందించే కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే, ఆర్టీవోకి వినతిపత్రాన్ని అందజేసారు. లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకునిన ప్రతి ఒక్కరూ ఎల్.ఎల్.ఆర్ కు ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేసే సమయంలో తప్పనిసరిగా హాజరై ఎల్.ఎల్.ఆర్. పత్రమును పొందగలరని ఎం.ఎల్. ఏ సూచించారు. ఆర్టీవో సానుకూలంగా స్పందించి అన్ని విధాలుగా మీకు సహకరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట జెడ్పిటిసి రాజశేఖర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రం రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, చక్రధర్ రెడ్డి, సాయి శ్యామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..



సకాలంలో విధులకు హాజరు కావాలి : కలెక్టర్

నారాయణపేట టౌన్ : అధికారులు సకాలంలో విధులకు హాజరై ప్రజా సేవ చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు ఆదేశించారు.శనివారం జిల్లా ఆసుపత్రి డిఎంహెచ్ఓ కార్యాలయం, డిఆర్డిఏ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉద్యోగులు ప్రతిరోజు విధులకు హాజరు కాకముందే బయోమెట్రిక్ తప్పక వేయాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.రోగులకు సరైన మందులు స్టాక్ ఉంచాలన్నారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు,వైద్య సిబ్బంది డిఆర్డిఏ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ మాకొద్దు.

మరికల్ : మండల పరిధిలోని చిత్తనూరు ఇథనాల్ పరిశ్రమ రద్దు ఎగ్లాస్పూర్ గేట్ దగ్గర ప్రారంభమైన నిరవధిక రిలే ధర్నాలు శనివారానికి 22 రోజుల పూర్తి అవుతున్నది.ఈ ధర్నా ను కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న రైతులు ధర్నా కార్యక్రమం పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు.ఇథనాల్ కంపెనీ వల్ల భవిషత్ లో భూగర్భ జలాలు విషపూరితమవుతున్న అన్నారు. చుట్టు ప్రక్కల గ్రామాలకు రేపు తాగు నీరు దొరకని పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు . పూర్తిగా దెబ్బదిని రైతుల జీవనోపాధిని ధ్వంసం అవుతుందన్నారు.ఈ ప్రాంతాన్ని నాశనం చేయడానికే ఇథనాల్ కంపెనీ పెట్టారని,దీనికి పూర్తి బాధ్యత బీఆర్ ఎస్‌పార్టీ నాయకులే వహించాలన్నారు.ఈ ధర్నాలో ఉచ్చోల్ల నాగమ్మ, నడిపి ఉసెన్,బండారి వెంకటయ్య, ఉచ్చోల్ల మధు,దాసయ్య, యశోధ,బండారి నరేందర్, ఉచ్చోల్ల ఎల్లప్ప,పాతర్ చేడ్ నర్సింహ్మా, బండారి వెంకటేష్ , చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ. సభ్యులు పాల్గొన్నారు.

చౌకధర దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ

నారాయణపేట టౌన్ : చౌక ధర దుకాణం ద్వారా బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ రేషన్ డీలర్ను ఆదేశించారు. శనివారం జిల్లా పరిధిలోని కొల్లంపల్లి గ్రామ చౌక ధర దుకాణాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటిలో స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి తెలుసుకున్నారు. ప్రతినెల అందరికీ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ ను ఆదేశించారు.

నూతన ఎస్ఐకి ఘన సన్మానం

నారాయణపేట టౌన్ : నారాయణపేట పట్టణానికి నూతన ఎస్హెచ్ఓ ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన జి. విజయకుమార్ ను శనివారము నారాయణపేట సీనియర్ ముస్లిం నాయకులు సర్ఫరాజ్ అన్సారి తదితరులు మర్యాదపూర్వకంగా పోలీస్ స్టేషన్లో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.

ఎమ్మెల్యేని సన్మానించిన మైనార్టీ నాయకులు

జోగులాంబ గద్వాల : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కె.టి.దొడ్డి మండల పరిధిలోని సోంపురం, చింతలకుంట గ్రామాలకు చెందిన మైనార్టీ నాయకులు ఉర్దూ ఘర్ కమ్ షాది ఖానా నిర్మాణం ప్రభుత్వ నుండి ఉత్తర్వులు జారీ చేసి ప్రతి గ్రామానికి చొప్పున రూ.30లక్షల నిర్మాణం చేయడానికి కేటాయించి నందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డిలను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు, కేటీఆర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌కు ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, జడ్పీటీసీ రాజశేఖర్, గట్టు మండలం సీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేష్, సర్పంచులు తిక్కన్న, సత్యానారాయణ, ఎంపీటీసీ గోవిందు, సింగిల్ విండో డైరెక్టర్ రఘుకుమార్‌శెట్టి, మండలం కో-ఆప్షన్ మెంబర్, బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు సందర్శించుకున్న న్యాయమూర్తి దంపతులు

మల్దకల్ : మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, శ్రీ లక్ష్మీ విష్ణుమూర్తి దేవాలయాలను శనివారం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గుబ్బా ప్రభాకర్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవాలయ చైర్మన్ ప్రహల్లాద రావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు చేయించారు. ఇంకా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించుకొని కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యులు న్యాయమూర్తి దంపతులను ఘనంగా శాలువా, పూలమాలతో సన్మానం చేశారు.

అపర తిరుపతి పుస్తకావిష్కరణ..

మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అపర తిరుపతిగా విలసిల్లాలని కోరుతూ న్యాయమూర్తి సొంత ఖర్చులతో ముద్రించిన 1000 అపర తిరుపతి పుస్తకాలను శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణ మండపంలో ఆవిష్కరించారు. మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం అపర తిరుపతిగా విలసిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదనాచారి, రమేష్, రవి, చంద్రశేఖరరావు, బాబురావు, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వెంకటన్న, వీరారెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదామి శ్రీనివాసులు, మనసాని నాగరాజు, మధ్యల బండ నాగరాజు, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు



ఉండవెల్లి : తుఫాన్ ప్రభావం వల్ల పడుతున్న వర్షాలకు రోడ్లు దెబ్బతిని రాకపోకలకు సమస్యగా ఏర్పడింది. నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు పూర్తిగా గుంతలుగా మారి వర్షపు నీళ్ల నిలువ చేరి వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మనపాడు నుంచి అల్లంపూర్ చౌరస్తా కొచ్చే రోడ్డు గుంతల మయంగా మారింది. అలంపూర్ చౌరస్తా నుంచి లింగనాయకి వెళ్లే రోడ్డు దుస్థితి బైరాపురం బసాపురం మీదికి వెళ్లే రోడ్డు పరిస్థితి పూర్తిగా దెబ్బతిని సమీప గ్రామాల్లోని ప్రజలతోపాటు రాకపోగాలకు అంతరాయం ఏర్పడింది. గుంతలో నిలిచిన నీటిని మళ్లించేందుకు కూడా అధికారులు ప్రయత్నాలు చేయకపోవడంతో పరిస్థితి దారుణంగా మారుతుంది. అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడకపోవడంతో రాకపోకల మధ్యన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలనే స్థానికులు కోరుతున్నారు.

ఆగస్టు 9,10న మహాపడావు



జోగులాంబ గద్వాల : సీఐటీయూ జిల్లా కార్యాలయం నందు శనివారం సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 9,10 తేదీలలో రెండు రోజులపాటు కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నిర్వహించే నిరసన కార్యక్రమం మహాపడావు జయప్రదం చేయాలని శనివారం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిలు అంజనేయులు, వివి నరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిస్సిగ్గుగా దేశంలో అమలు చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని దేశాన్ని కాపాడుకోవాలని దేశవ్యాప్తంగా ఆగస్టు 9,10 తేదీలలో రెండు రోజులపాటు మహాపాడావు పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాలతో పాటు పబ్లిక్ సెక్టర్స్ సంఘాల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటస్వామి , జిల్లా నాయకులు ఉప్పేరు నరసింహ, ఏఐటీయూసీ నాయకులు రంగస్వామి పాల్గొన్నారు

పర్యావరణం బాగుంటేనే ఊర్లు బాగుంటాయి : కలెక్టర్

జోగులాంబ గద్వాల : పర్యావరణం బాగుంటేనే ఊరూ బాగుంటుందని, ప్రజలు బాగుంటారని ఎక్కడ ఖాళీ స్తలం ఉన్న అక్కడ మొక్కలు నాటాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఉదయం జిల్లా ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ స్థలం ఎక్కడ ఉన్న అక్కడ ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటితే పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి కాపాడాలని అన్నారు. గ్రీన్ ఎర్త్ క్యాంపెయిన్‌లో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో 500మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులందరితో కలిసి మొక్కలు నాటారు. పాదులు తీసి మట్టి నింపి మొక్కలు నాటాలని, వర్షానికి మొక్కలు పడిపోకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి..

ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు



క్రాంతి అన్నారు. శనివారం ఐడీఓసీలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు అవగాహన కార్యక్రమంలో రైతులకు, జిల్లా అధికారులకు, కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నందున ప్రజలు అందరు ఓటు వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అందరు కూడా మీకున్న పోలింగ్ స్టేషన్‌లో మీ పేర్లు లిస్టులో ఉన్నాయా లేదా అని ఒకసారి చెక్ చేసుకోవాలన్నారు. వివి ప్యాట్, బ్యాలెట్ యూనిట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుపరింటెన్డేంట్ వరలక్ష్మి, ఈడీ ఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డి పి ఆర్ ఓ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్‌అర్ సత్యనారాయణ, ఎల్డీఎం అయ్యప్పరెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు రమా శృతి, హాజీ యాదవ్, అసిస్టెంట్ డీఆర్‌డీఏ సరోజమ్మ, పశు సవర్ధక శాఖ అధికారి వెంకవెంకటేశ్వర్లు, ఈడీ ఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, డీపీఆర్‌ఓ చెన్నమ్మ, బ్యాంకు సిబ్బంది, ఆర్‌అండ్‌బీ ప్రగతి, సరఫరాల అధికారి రేవతి, ప్రజలు, పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్...

10వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి సాంబయ్య బదిలీపై జిల్లాకు వచ్చి నందున శనివారం గద్వాల కలెక్టర్ వల్లూరి క్రాంతి పూల బొకేతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు ఉన్నారు.

18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

ఊట్కూర్ : బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేలో 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలనీ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. శనివారం మండల కేంద్రమైన ఊట్కూర్ లో బూతుస్థాయి అధికారుల శిక్షణ సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిలో 18 ఏళ్ల నుండి 20 లోపు గల వారిని ఫారం-6 ద్వారా నమోదు చేసి అప్లోడ్ చేయాలన్నారు అనంతరం తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఫారం 6, 7, 8 ద్వారా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వాటిలో ఎన్ని పెండింగులు ఉన్నాయి తదితర విషయాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు కంప్యూటర్ ద్వారా పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు ఈ ఆర్ ఓ లాగిన్ ద్వారా ఓటర్ల జాబితా మార్పులు చేర్పులు తదితర వాటిని పరిశీలించారు. తహసిల్దార్ తిరుపతయ్యకు పలు సూచనలు చేశారు. అనంతరం షెడ్యూల్ కులాల (ఎస్సీ) బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధించాలి'

జోగులాంబ గద్వాల : మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించి మహిళల పై అనాగరిక చర్యలకు పాల్పడిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు పరంజ్యోతి డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళల పై అకృత్యాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక పాత బస్టాండ్ లోని వైస్సార్ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి నరసింహ ఉప్పేర్ నర్సింహా రామకృష్ణ, రఘు రాఘవేంద్ర పరశురాముడు, గజేంద్ర నర్సింహా బాలు మహేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మణిపూర్‌లో మహిళల పై అకృత్యాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని శనివారం శాంతినగర్ మండల కేంద్రంలో ప్రజలు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.



కార్యక్రమంలో పాస్టర్లు ఎం జె శాంతిదాత, ధర రాజు, ఆశీర్వాదం, డానియల్ దేవన్న, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.విజయకుమార్ దళిత సంఘం నాయకులు ఆర్ మోహన్ జిల్లా నాయకులు వై రామ్మోహన్, భాస్కర్ మధుబాబు, సురేష్ వడ్డేపల్లి రాజోలు మండలాల గ్రామాల ప్రజలు పాల్గొని ఎమ్మార్వో కు వినతి పత్రం చేశారు. శాంతినగర్ సెంటర్లోని చాకలి ఐలమ్మ విగ్రహం నుండి నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు.

ఇటిక్యాలలో : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నందు మండల అధ్యక్షులు పి.యువరాజ్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు పి.తిరుపాల్, మండల సెక్రటరీ ఏ.లక్ష్మణ్, నక్కలపల్లి నారాయణ, సాతర్ల రాజేష్ , నారాయణ, బుడ్డన్న, శేషన్ కుమార్, తిమోతి, రాజ్ కుమార్, వావిలాల దుబ్బన్న, సోషల్ మీడియా ఇంచార్జ్ ముప్పారపు ఎల్లయ్య, అనోక్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్‌లో : మణిపూర్ లో జరిగిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం గద్దె దిగాలని అలంపూర్ మండల కేంద్రంలో గాంధీచౌక్ నందు శనివారం సీఐటీయూ, కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.నరసింహ, కేవీపీఎస్ మండల కార్యదర్శి కె.నాగరాజు, టౌన్ కార్యదర్శి కె.అయ్యప్ప, సిద్దయ్య, సీఐటీయూ నాయకులు నూర్ అహ్మద్, సేక్షావలి, మాబాష, కృష్ణ, ఎస్ ఎచ్ మద్దిలేటి, అఖిల్, దాసు, ఎజెంద్ర, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డులో ప్రయాణించాలంటే నరకమే'

ధరూర్ : రోడ్డులో ప్రయాణించాలంటే నరకమేనని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ధరూర్ మండలంలోని నెట్టెంపాడు నుండి నీలహళ్లి వరకు అక్కడి నుండి అలాగే కె.టి.దొడ్డి మండలంలోని పాతపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డును జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఆపద వస్తే ఆ దారిన ప్రయాణికులు వెళ్తే ఇక నరకయాతన అనుభవించాల్సిందే ధరూర్ మండలంలోని నెట్టెంపాడు గ్రామం నుండి నీలహళ్లి మార్గ మధ్యలో 5కిలో మీటర్ల వరకు ఉన్న రహదారి పూర్తిగా అధ్వానంగా తయారయింది. నాయకులు కమిషన్లకు కక్కుర్తి పడి అభివృద్ధి పనులను దూరంగా నెట్టి వేశారని మీ పాలనలో ఏం అభివృద్ధి చేశారో మీరే ఈ రోడ్డును చూసి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు ఆలూరు వెంకట్రామరాములు, మండల అధ్యక్షులు నెట్టెంపాడు గోవిందు, ఉపాధ్యక్షులు మునెప్ప, ఆంజనేయులు కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శిలు మల్దకల్, అడవి ఆంజనేయులు, మల్దకల్ మండల అధ్యక్షులు విష్ణు, కార్యదర్శి తిమ్మప్ప, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వు ధరించి జీపీ కార్మికుల నిరసన



నారాయణపేట టౌన్ : నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కేంద్రంలో గత 17 రోజుల నుండి గ్రామపంచాయతీ కార్మికులు తమ యక్క న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్నారు. శనివారం చెవిలో పువ్వులు పెట్టుకొని గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ కార్మికులు సమ్మెలో ఉన్న కారణంగా గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో గ్రామాలలో చిత్తాచెదారం నిండి దుర్వాసన వెదజల్లుతుందని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు అంటూ వ్యాధులు సోకే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల కోరికలు నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జోషి, ఇఫ్టు నాయకులు తాయప్ప,సాయి, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటప్ప, బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వీరప్ప, మణిక్యప్ప లు, మరియు జిపి కార్మికులు చంద్రప్ప, శీను, శివానంద్, వెంకటప్ప, యల్లప్ప, సిద్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్ : తమ న్యాయబద్ధమైన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని గ్రామపంచాయతీ సిబ్బంది అన్నారు. మండల కేంద్రమైన ఊట్కూర్ లోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 17వ రోజుకు చేరుకున్నది. కార్యక్రమంలో మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

నారాయణపేట టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం19వేల రూపాయలు ఇవ్వాలని, కార్మికులందరినీ కూడా పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల రాం డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేట మండల పరిషత్ కార్యాలయం ముందు జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. 17 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాదనీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నరసింహ, జిపి కార్మికులు పాల్గొన్నారు.

రైతుల ట్రాన్స్ పోర్ట్ డబ్బులను చెల్లించాలి

నవతెలంగాణ -నర్వ

రైతుల పక్షాన రైతుల ట్రాన్స్పోర్ట్ డబ్బులను తక్షణమే చెల్లించాలని పిఎసిఎస్ ముందు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రైతుల పక్షాన ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తీసుకుపోవడం పోలీసులకు తగదని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా సెక్రెటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ నీరజ్ మండిపడ్డారు. రైతుల డబ్బులను వేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారని ఆరోపించారు.నర్వ సింగిల్ విండో పాలకవర్గం గత 3సంవత్సరాల నుంచి రైతులకు రావాల్సిన రవాణా డబ్బులు చెల్లించకుండా మాజీ చైర్మన్ , ప్రస్తుత చైర్మన్ ,డైరెక్టర్లు,పాలకవర్గ సభ్యులు,సిబ్బంది కలిసి రైతుల సొమ్మును కాజేసిన వారిపై చర్యలు తీసుకుని



రైతులకు వెంటనే డబ్బులు మిత్తితో చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్,జిల్లా నాయకులు డి కృష్ణారెడ్డి,వివేకవర్ధన్ రెడ్డి,రవికుమార్,శీను మండల నాయకులు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణ,, భీమా నదులకు జలకళ

నవ తెలంగాణ -కృష్ణ



ఎడతెరిపి లేని వానాలతో వాగులు చెరువులు నిండి ఆ నీళ్లన్నీ చేరుతుండడంతో భీమా, కృష్ణా నదిలో జలకల సంతరించుకున్నాయి. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువన ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంత కర్ణాటక రాష్ట్రంలో ఇటు భీమా నది పరివాహక ప్రాంత కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులలో విస్తృతంగా వర్షాలు కురవడంతో వరద నీరు భారీగా చేరుకుని కృష్ణానదికి ఉపనదిగా ఉన్న భీమా నది శనివారం నిండుగా వడివడిగా పరుగులేడుతూ తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించి కృష్ణ మండలం తంగడిగి గ్రామం వద్దా కృష్ణా నదిలోకి చేరుకొని నిండుగా దిగువకు ఉన్న జూరాల వైపు పారుతున్నాయి.

జోరందుకున్న వరి నాట్లు

వారం రోజుల కింద ఇటు కృష్ణ నది అటు భీమా నదితీర ప్రాంతమైన కృష్ణ మండలం నది పరివాహక ప్రాంతంలో వర్షాలు లేక నదిలో నీరు లేక వెలవెలబోయాయి, రైతులు వరి నారుమళ్ల పోయడంతో కొన్నిచోట్ల ఎండిపోయాయి, కొందరు రైతులు వరి నాట్లు పెట్టి నీరు కోసం ఎదురు చూశారు ఇంకొందరు నదిలో నీరే లేకపోవడంతో వరి నాట్లు పెట్టలేక కాలిపొలాలుగా వదిలేశారు, రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవడంతో శుక్రవారం, శనివారం కృష్ణ, భీమా నదిలో నీరు చేరడంతో రైతుల ముఖాల్లో సంతోషం ఏర్పడింది రైతులు సిద్ధంగా ఉన్న తమ పొలాలలో వరి నాట్లు జోరందుకున్నాయి.

'ఉపాధి హామీలో పండ్లతోటల పెంపకం చేపట్టండి '

నవతెలంగాణ - కృష్ణ

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపట్టాలని, మండలంలోని ఆసక్తి గల రైతులు తమ గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని కృష్ణ మండల ఎంపీడీవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యాన వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో సన్నా చిన్నకారు రైతులకు రాయితీపై పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ పథకంలో భాగంగా ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండి ఐదెకరాల లోపు భూమి ఉండి సాగునీటి వసతి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు పెరిగేంతవరకు దాదాపు అన్ని ఖర్చులు అందిస్తుందన్నారు, వంద శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం అందించనున్నట్లు తెలిపారు

కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలి

నారాయణ పేట : కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా జల సాధన సమితి కో కన్వీనర్ హెచ్.నర్సింహా ఆధ్వర్యంలో వినతి అందజేశారు. నారాయణ పేట జిల్లా రైతులకు సాగునీరు అందించే జీవో 69 అమలు చేసి నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలన్నారు.

ధన్వాడ : ధన్వాడ మండల కేంద్రము లోని అంబెద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జల సాధన సమితి కో కన్వీనర్ హెచ్.నర్సింహా,మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు రామచంద్రయ్య మాట్లాడుతూ జీవో 69 అమలు చేసి నారాయణ పేట జిల్లా రైతులకు లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మాకం సురేందర్,జల సాధన సమితి నాయకులు కృష్ణయ్య, కుర్మప్ప,వడెప్ప,చిన్న నర్సింహులు, రాజమూరి,అఖిల పక్ష నాయకులు సుదర్శన్ గౌడ్,విష్ణువర్ధన్ రెడ్డి,కృష్ణయ్య కురుమూర్తి, బాల్ రాం,ఆర్.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న తహసీల్దార్ స్లాబ్ కార్యాలయం

నవ తెలంగాణ- నారాయణపేట టౌన్



జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది హాలులో స్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఉన్నవి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత పెచ్చులు ఊడే అవకాశం ఉన్నట్లు అక్కడికి వచ్చిన అర్జీదారులు వాపోవుచున్నారు. కనుక ప్రమాదము జరగకముందే ముందు జాగ్రత్త చర్యలుగా స్లాబ్ యొక్క పెచ్చులను సరిచేయాలని ప్రజలు కోరారు.

పోలీసులు అంకిభావంతో పనిచేస్తే గుర్తింపు : ఎస్పీ



నారాయణపేట టౌన్ : జూన్ నెలలో ఫంక్షనల్ వర్టికల్ వారీగా విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన19మంది పోలీసు అధికారులకు,సిబ్బందికి కేపీఐ రివార్డ్స్ ప్రోత్సహకాలు అందించిన ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజల కోసం అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు ఎల్లవేళలా సేవలు అందించడానికి అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఫంక్షనల్ వర్టికల్ వారిగా పోటీపడి విధులు నిర్వర్తిస్తే రివార్డులు, అవార్డులు అవే వస్తాయి అని, కష్టపడి అంకితభావంతో విధులు నిర్వహించే వారికి డిపార్ట్మెంట్లో కచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. పోలీస్ అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిఆర్బి డిఎస్పి వెంకటేశ్వరరావు, డిఎస్పి కే.సత్యనారాయణ, పోలీస్‌అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ ఎస్ఐ గా జి.విజయ్ కుమార్

నారాయణపేట టౌన్ : నారాయణపేట టౌన్ నూతన ఎస్సైగా జి.విజయ్ కుమార్ బాధ్యతలు శనివారం స్వీకరించారు. ఇతను ఇంతకుముందు నాగర్ కర్నూల్ జిల్లా టౌన్ ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వర్తించి బదిలీపై నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్ కు రావడం జరిగింది. ఇంతకుముందు నారాయణపేట టౌన్ ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వర్తించిన ఎస్సై సురేష్ గౌడ్ నారాయణపేట ఎస్బి ఎస్సైగా బదిలీ అయ్యారు. నూతన ఎస్సై జి.విజయ్ కుమార్ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ఎలాంటి సమస్యలు లేకుండా విధులు నిర్వర్తించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలందరికీ సమన్యాయం అందిస్తూ, బాధితులు తీసుకొచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి ప్రజలకు పోలీస్ వ్యవస్థ పై నమ్మకం, బరోసా కల్పించాలని సూచించారు.

కోర్టు డ్యూటీ ఆఫీసర్లు సమర్థవంతంగా వ్యవహరించాలి

కృష్ణ : కోడ్ డ్యూటీ ఆఫీసర్లు సమర్థవంతంగా వివరించి నిందితులకు శిక్ష పడే విధంగా పనిచేయాలని కృష్ణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ్ భాస్కర్ అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లకు మరియు వర్టికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ మరియు విచారణలోని సమయంలో కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ సమర్థవంతంగా ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్, సమన్స్ డ్యూటీ ఆఫీసర్, వారంట్ డ్యూటీ ఆఫీసర్స్ మరియు కోర్టులోని వివిధ అధికారులను సమన్వయపరుస్తూ సాక్షులు మరియు నిందితులు కోర్టు నందు హాజరగునట్లు విధులు నిర్వర్తించి తద్వారా కేసుల విచారణ త్వరితగతిన విజయవంతంగా పూర్తి అగుటకు దోహదపడవలెనని సూచించారు కోర్టు డ్యూటీ ఆఫీసర్ సమర్థవంతంగా వ్యవహరించడం వలన నిందితులకు సరైన రీతిలో శిక్షలు పడటానికి దోహదపడినవారై సకాలంలో బాధితులకు న్యాయం జరిపినవారై ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందులు పాల్గొన్నారు.